RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# సివిల్ కాంట్రాక్టుల పేరుతో రూ.10కోట్లు మింగేశారు! - ఆధారాలతో సహా ఫిర్యాదు




**హైదరాబాద్ :** జీహెచ్ఎంసీలో విలీనమైన శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కోట్లాది రూపాయల అవినీతి అక్రమాలు బయటపడుతున్నాయి. శానిటేషన్ సహా పలు కీలక విభాగాల్లో అభివృద్ధి పేరుతో పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టినట్లు జీహెచ్ఎంసీ సహా పురపాలక శాఖకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఒక్క బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే డ్రైఫూట్స్, టీ, బిస్కట్లు, మొక్కలకు రంగు వేయడం, బ్లీచింగ్ పౌడర్ సహా 232 పనుల్లో సుమారు రూ.10 కోట్ల దుర్వినియోగం చేశారని ఆధారాలతో సహా పలువురు సివిల్ కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం, జీహెచ్ఎంసీ తక్షణమే అవినీతిని నిగ్గుతేల్చేందుకు విజిలెన్స్ విచారణ జరిపించి అక్రమాలకు పాల్పడిన అధికారులు, శానిటేషన్ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.రూ.10 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది : అప్పుల్లో ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్?కు కొత్త తిప్పలు వచ్చిపడ్డాయి. ఇటీవల జీహెచ్ఎంసీలో విలీనమైన శివారు మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు సంబంధించి కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్?లో ఉన్నాయి. ఆదాయం, ఆస్తులు, అప్పులను స్వీకరించిన జీహెచ్ఎంసీ ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో శానిటేషన్, సివిల్ వర్క్ లకు సంబంధించి కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయలు చెల్లించాల్సి ఉంది. అయితే ఇక్కడే పలువురు అధికారులు తమ తెలివిని ప్రదర్శించి అభివృద్ధి పేరుతో బినామీ కాంట్రాక్టర్ల పేరిట అడ్డగోలుగా కోట్లాది రూపాయల బిల్లుల ఫైల్స్?ను జీహెచ్ఎంసీకి సమర్పించారు. ఇందుకు ఉదాహరణే బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్?కు సంబంధించి అధికారులు సమర్పించిన ఫైల్స్. సుమారు 232 పనులకు సంబంధించి రూ.10 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని వాటిలో వివరించారు. వాటర్ బాటిల్స్, దిన పత్రికలు, పేపర్ ప్లేట్లు, టీ, బిస్కెట్లు, డ్రైఫూట్స్, మొక్కలను పెంచడం, మొక్కలకు రంగులు వేయడం, ఫాగింగ్ మిషన్లు, కంప్యూటర్లు, ప్రింటర్లు, కుర్చీలు, టేబుల్స్, జేసీబీ, స్వచ్ఛ సర్వేక్షన్ ఫ్లెక్సీల తయారీ, బతుకమ్మ, బోనాల ఉత్సవాలు, తెలంగాణ వజ్రోత్సవాల లాంటి కార్యక్రమాలకు సంబంధించిన ఖర్చులను ఒకటికి రెండింతలు చేసి పెద్ద మొత్తంలో జీహెచ్ఎంసీకి సమర్పించారు.విచారణ జరిపి అవినీతి అక్రమాలను బయపెట్టాలి : అయితే ఈ పనుల్లో బినామీ కాంట్రాక్టర్ల పేర్లతో అధికారులే తప్పుడు లెక్కలు అందించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో సివిల్ ఇంజినీర్లపై తీవ్రమైన ఆరోపణలు రావడంతో స్పందించిన ఆయా కాంట్రాక్టర్లు అసలు గుట్టు లాగే ప్రయత్నం చేశారు. బడంగ్ పేట కార్పొరేషన్?లో అధికారులు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, విజిలెన్స్ విచారణ జరిపి అవినీతి అక్రమాలను బయపెట్టాలని ఓ సివిల్ కాంట్రాక్టర్ ప్రభుత్వంతో పాటు జీహెచ్ఎంసీ, పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. శానిటేషన్?లోని పలువురు అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. అవినీతికి సహకరించిన కాంట్రాక్టు ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి బిల్లులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.సమగ్ర విచారణ జరిపించాలి : సివిల్ కాంట్రాక్ట్ పనుల్లో ప్రతి విషయానికి ఆధారాలు ఉంటాయని, శానిటేషన్ కాంట్రాక్టుల విషయంలో ఎలాంటి ఆధారాలు లేకుండానే కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేస్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ఇటీవల విలీనమైన 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లపై సమగ్ర విచారణ జరిపించాలని బడంగ్ పేట సివిల్ కాంట్రాక్టర్ సాయికిరణ్ కోరుతున్నారు.పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాల ఆరోపణలు : ఇటీవల విలీనమై మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఆర్థిక లావాదేవీల విషయంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాల ఆరోపణలు రావడంతో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులను తాత్కాలికంగా పక్కనపెట్టినట్లు సమాచారం.

# ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక



**హైదరాబాద్ :** ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ( -ప్రగతి ప్రణాళికను () నిర్వహిస్తుంది. అయిదు దశల్లో 99 రోజుల పాటు జరిగే కార్యక్రమానికి నోడల్ శాఖ గా వ్యవహరిస్తున్న ప్రణాళిక శాఖ యాక్షన్ ప్లాన్ను సిద్ధం చేసింది.ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల( ) నిర్వహణ ,ఏప్రిల్ 16న మండల స్థాయిలో , మే 2న నియోజకవర్గ స్థాయి , మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని ఆ శాఖ వెల్లడించింది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపింది. 10 వివిధ థీమ్‌లతో శాఖల వారీగా 99 రోజుల కార్యక్రమం ఉంటుందని వివరించింది.మొదటి థీమ్‌లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ , రెండవ థీమ్‌లో ఆరోగ్యం 3లో అరైవ్.. అలైవ్, 4లో సంక్షేమం , 5లో పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, 6లో రైతు సంక్షేమం.. వ్యవసాయంపై కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.7లో విద్య, 8లో యువత.. క్రీడలు, 9లో మహిళలు , 10వ థీమ్‌లో పర్యావరణంపై సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు , 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలుంటాయని వివరించింది. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేశామని వెల్లడించింది .

# తెలంగాణ రాష్ట్ర ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ముఖ్యమంత్రి



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 3:-** కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. రంగుల పండుగగా ప్రసిద్ధి చెందిన హోలీ ఆనందోత్సాహాల నడుమ ప్రతి ఇంటా సుఖశాంతులు నిండాలని ఆయన ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసికట్టుగా హోలీ వేడుకలు జరుపుకోవాలని సూచించారు.తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజల జీవితాల్లో సంతోషం, సమృద్ధి చేకూరాలని ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు

- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి.



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 3:-** రంగుల పండుగ హోలీ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. హోలీ పండుగ సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరియు ఆనందానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కులమత భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా హోలీ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి ఇంటా సుఖశాంతులు నెలకొని, ప్రజల జీవితాలు రంగుల మయం కావాలని ఆకాంక్షించారు. యువత, మహిళలు, పెద్దలు సురక్షితంగా పండుగను జరుపుకోవాలని సూచించారునియోజకవర్గ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, సమైక్య భావనతో ముందుకు సాగితే ఇబ్రహీంపట్నం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. హోలీ పండుగ అందరికీ ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రక్షణ చట్టం బిల్లు పెట్టాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం




**హైదరాబాద్, మార్చి 03:** రాష్ట్రంలో బీసీల పై అగ్రకులాల దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. బీసీల సంక్షేమం, రక్షణ కోసం ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీ రక్షణ చట్టం బిల్లు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో అగ్రకులాల దాడిలో ఇటీవల జరిగిన రెండు నెలల పసిపాప మరణించిందని, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలోనే బీసీల అట్రాసిటీ రక్షణ చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏదో ఒకచోట సాంఘిక బహిష్కరణలు, కులం పేరుతో దూషించి దాడులు చేయడం, అత్యాచారాలు హత్యలు చేయడం జరుగుతున్నాయని వీటిని ఎదుర్కోవడానికి బీసీ సమాజమంతా ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

# కల్వకుర్తి మాజీ శాసన సభ్యులు శ్రీ గుర్ర జైపాల్ యాదవ్ కి మాతృవియోగం



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 3:-** కల్వకుర్తి మాజీ శాసన సభ్యులు శ్రీ గుర్ర జైపాల్ యాదవ్ మాతృమూర్తి గుర్ర మంగమ్మ, ఇవాళ ఉదయం స్వర్గస్తులయ్యారు. ఆమె మరణ వార్త తెలిసిన వెంటనే పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు ఆమె నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ దీ=ూ పార్టీ ఇన్‌చార్జ్ క్యామ మల్లేష్, మాజీ శాసన సభ్యులు అంజయ్య యాదవ్, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మంగమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు.మంగమ్మ అంత్యక్రియలు కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిసింది.

# ఆరుట్లలో గ్రామంలో ఘనంగా హోలీ వేడుకలు




**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 3:-** ఆరుట్ల గ్రామంలో హోలీ పండుగను గ్రామస్తులు ఉత్సాహభరితంగా, ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని యువకులు, మహిళలు, పెద్దలు రంగులతో ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల అధ్యక్షులు కంబాలపల్లి భాస్కర్ పాల్గొని గ్రామ ప్రజలతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. హోలీ పండుగ కులాలు, మతాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే పెద్ద పండుగ అని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ ఐక్యంగా, ఆనందంగా హోలీ వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంపదలతో వర్ధిల్లాలని దేవుడిని కోరుకుంటూ గ్రామ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ వేడుకలతో ఆరుట్ల గ్రామంలో పండుగ సందడి నెలకొంది.

# వసంత ఋతువుకు ఆహ్వానం పలికిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 3:-**



రంగుల పండుగ హోలీ సందర్భంగా రెవిన్యూ గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వసంత ఋతువుకు ఆహ్వానం పలికే ఈ పండుగ ప్రేమ, ఐక్యత, స్నేహానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

చెడుపై విజయం సాధించిన తరుణాన్ని గుర్తు చేసే హోలీ పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు. రంగు రంగుల సంబరాల వేడుక ప్రేమ, ఐక్యత, స్నేహానికి ప్రతీక అని తెలిపారు. హానికరమైన రసాయనాలకు దూరంగా ఉండి, సహజ సిద్ధమైన రంగులతో హోలీ వేడుకలు నిర్వహించాలని సూచించారు. మనసులోని స్వార్థ భావాలను తొలగించి, పరస్పర గౌరవంతో పండుగను జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాష్ట్ర ప్రజలకు హోలీ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన రేవంత్ రెడ్డి



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 3:-** హోలీ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ మనందరి జీవితాల్లో ఆనందం, ఐక్యత, స్నేహభావం నింపాలని ఆకాంక్షించారు. హోలీ పండుగలోని పరంపరలను గుర్తుచేస్తూ, శాంతి, పరస్పర గౌర వాన్ని ప్రతిబింబించే ఈ పర్వదినం ప్రతి ఇంటిలో సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెలసేలా చేయాలని కోరారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.సురక్షితంగా, పర్యావరణ హితంగా హోలీ వేడుకలు నిర్వహించాలని సూచించిన ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

